క్లుప్తంగా

సీత్లాభవాని వేడుకలు

మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి గ్రామంలో మంగళవారం సీత్లాభవానీ వేడుకలను లంబాడీలు ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళలు బాజా బజంత్రీలతో గ్రామశివారులోని అడవిలోకి వెళ్లి సీత్లా భవానీ వేడుకలు నిర్వహించారు. సీత్లాభవానీకి మొక్కులు చెల్లించి సాంప్రదాయ దుస్తులతో దాండియా ఆడారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిట్యాల: మండలంలోని జడలపేట గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న వ్యక్తులు వావిల్ల బాలరాజు, ఎండి.అఫ్జల్, ఎం.ఆగాచారి, అడిదెల రాజిరెడ్డి, కర్రు ప్రతాప్‌రెడ్డి వద్ద రూ.4500లతో పాటు పేకాట ముక్కలు దొరికినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది నవీన్, నాగరాజు, సందీప్ పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని దుబ్బగూడేనికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్ అదుపు తప్పి పడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి కుదురుపల్లి వాగు వద్ద బైక్ అదుపు తప్పి పడడంతో మధు, ఎజాస్‌లకు గాయాలయ్యాయి. వారిని వెంటనే మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య అందించి మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లికి తీసుకెళ్లారు.

సన్మానం

మహాముత్తారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించిన ఎండీ మౌలానా ఉద్యోగ విరమణ పొందారు. దీంతో పాఠశాలలో మంగళవారం ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు లావుడ్యా ప్రకాశ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా పాఠశాల, కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవ్‌సింగ్, రాంసింగ్, జయ, మధుకర్ రెడ్డి, మంజుల, రజిని పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఉద్యమ బాట నిర్వహించారు. భూపాలపల్లి మండలంలో కమలాపూర్, మల్లంపల్లి, ఆజాంనగర్, నాగారం, మహాముత్తారం, మండలలోని తదితర పాఠశాలలను సందర్శించి ఆ పాఠశాలల్లో ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నామన్నారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ.. ఏ పాఠశాలలో చూసినా అనేక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయని, పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవన్నారు. కొన్ని పాఠశాలల్లో మంచినీటి వసతి లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

'పాఠశాలలపై చర్య తీసుకోవాలి'

ములుగు రూరల్: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్య తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి అన్నారు. మంగళవారం మండలంలోని జాకారం లిబర్టి పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా లేక విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారని అన్నారు. కనీస వసతులు లేని పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి


చిట్యాల: తిథి భోజనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు


కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేటలో..

చిట్యాల: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల విద్యాధికారి కొడెపాక రఘుపతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతో పాటు వివిధ గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు తిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన దేవా వీరన్న పాఠశాలపై ఉన్న అభిమానంతో విద్యార్థులందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, రాజమౌళి, సరళదేవి, నీలిమా రెడ్డి, విజయలక్ష్మీ, సుజాత, రాంనారాయణ, బుర్రస దయ్య, శ్రీనివాస్, పీడీ సూదం సాంబమూర్తి, శంకర్, లలిత, బుజ్జమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

రేగొండ(కొత్తపల్లిగోరి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మరింత పోషకాహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తిథి (సామూహిక) భోజనం పేరిట కార్యక్రమాన్ని చేపడుతుంది. సప్తాహ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో దాత పొనగంటి వీరబ్రహ్మం సహకారంతో విద్యార్థులకు అరటిపండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు గిరిధర కృష్ణ, ఉపాధ్యాయులు రాజేందర్, చక్రధర్, కుమారస్వామి, శ్రీధర్, కోటిలింగం, కల్పన, మహేందర్, శిరీష, శ్రీనివాస్, మాధవి, రమాదేవి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


టేకుమట్ల: అరటి పండ్లను అందజేస్తున్న గువ్వాడి లక్ష్మణ్

పాఠశాలలో తిథి భోజనం

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు పద్మ ఆధ్వర్యంలో మంగళవారం తిథి భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఫ్రైడ్ రైస్, అరటి పండ్లను అందజేశారు. తిథి భోజనంలో విద్యార్థులకు అరటి పండ్లను అందించిన ఆరెపల్లి గ్రామానికి చెందిన గువ్వాడి లక్ష్మణ్‌కు పాఠశాల ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు, వరప్రసాద్, సుదాకర్, మొండయ్య, సతీష్, మేకల సదయ్య, రమేష్, హరికృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి


కారును తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

చిట్యాల: అపరిచితులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రావణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కైలాపూర్ గ్రామ శివారులో మావోయిస్టు సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతరం ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోకి ఎవరైన కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో అసాంఘిక వ్యక్తులకు ఆశ్రయం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ప్రతి వాహనదారుడు అనుమతి పత్రాలతో పాటు వాహనానికి నంబర్ ప్లేట్ కలిగి ఉండాలని కోరారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది నవీన్, నాగరాజు, సందీప్ తదితరులు ఉన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

భూపాలపల్లి రూరల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బీసీ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దొంగల రాజేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని మాయ మాటలు చెప్పి బీసీలకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీ కులగణన పూర్తయిన తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని లేకుంటే బీసీలకు రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఓబీసీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపుమేరకు కలెక్టరేట్ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. తక్షణమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, బీసీ సబ్ ప్లాన్‌కు తగిన నిధులు మంజూరు చేయాలన్నారు. గొల్ల కురుమలకు రెండో దశ గొర్రెలను పంపిణీ చేయాలి విజ్ఞప్తి చేశారు. మత్స్యకారులకు సబ్సిడీతో కూడిన చేప పిల్లల పంపిణీ చేయాలన్నారు. వేములరాజు గౌడ్, కంబాల రాజయ్య, రాష్ట్ర నాయకులు బట్టు రవి, గుండా సురేష్, మాచనవేని రవీందర్, నాంపల్లి కుమార్, చెక్క శంకర్, జాడిగట్టయ్య, కంచం నరసింహమూర్తి, అనుప మహేష్, ఆవుల సంతోష్, వట్టిం తిరుపతి, హరీష్, కృష్ణ, శ్రీనివాస్, సిలువేరు కార్తిక్, అనరాజు అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రసాద్

టేకుమట్ల: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని బూర్నపల్లిలో సైబర్ క్రైంలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల సెల్ ఫోన్‌లకు మెసేజ్‌లు, లింకులను పంపిస్తూ ఖాతాల్లోని డబ్బులను అపహరిస్తారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు కాల్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పొద్దన్నారు. అంతే కాకుండా ఆన్‌లైన్‌లో లోన్‌యాప్‌ల ద్వారా రుణాలను ఇచ్చి అధిక మొత్తంలో నగదును తీసుకుంటూ మానసిక వేధింపులకు గురి చేస్తారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్ వంటి వాటిలో గుర్తు తెలియని వ్యక్తులకు చాటింగ్, కాల్ చేయరాదని, డీపీ ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేస్తూ ఆత్మహత్యలు చేసుకునేలా వేధిస్తారని అన్నారు. బాలికలు ఆన్‌లైన్‌లో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆయన వెంట కానిస్టేబుళ్లు సుమన్, నాగరాజు, టీఎస్‌ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

రేగొండ: రైతులకు ఏకకాలంలో పంట రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచిందని పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం రెండో విడత రుణమాఫీ నిధులు సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేసిన సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. మండలంలోని పీఏసీఎస్ ద్వారా మొదటి విడతలో 739 మంది రైతులకు రూ.3కోట్ల42 లక్షలు, రెండో విడతలో 195 మంది రైతులకు రూ.కోటి31లక్షలు రుణమాఫీ జరిగిందని తెలిపారు. రుణమాఫీ పొందిన రైతులకు తిరిగి రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

బియ్యం అందజేత


బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడేనికి చెందిన జాడి దుర్గయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జేఎల్‌ఆర్ ఫౌండేషన్ నిర్వాకులు జాడి రామారాజు నేత, సభ్యులు మంగళవారం పరామర్శించి బియ్యం అందజేశారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం సమ్మక్క, సునార్కని లక్ష్మయ్య, మాజీ సొసైటీ డైరెక్టర్ కొండగొర్ల వెంకటయ్య, హరిబాబు, రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు రెయిన్‌కోట్ల పంపిణీ


రెయిన్‌కోట్లు అందజేస్తున్న సంస్థ సభ్యులు

కాటారం: కాటారం గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు భూపాలపల్లికి చెందిన అడ్వకేట్ వి.శ్రావణ్‌రావు సహకారంతో స్వయం కృషి స్వచ్ఛంద సభ్యులు మంగళవారం రెయిన్‌కోట్‌లు అందజేశారు. ప్రతి రోజు పరిశుభ్రత కోసం పని చేసే కార్మికులు వర్షాకాలంలో ఇబ్బంది పడకుండా ఉండటం కోసం రెయిన్‌కోట్‌లు అందజేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు కొట్టె సతీశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సందీప్, అఖిల్ మహదేవ్, రవి, రమేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ (అనుబంధం) రాష్ట్ర అధ్యక్షురాలు కొరిమి సుగుణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులకు రూ.10వేల గౌరవ వేతనం చెల్లించాలని కోరారు. అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేస్తున్న విధంగా మధ్యాహ్న భోజన వంట కార్మికులకు కోడిగుడ్లు, గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. డిమాండ్ల పరిష్కారానికి నేడు (బుధవారం) చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు చెప్పారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు గుండేటి మల్లక్క, అల్లం సుగుణ, వరలక్ష్మి, స్వర్ణలత, రాజేశ్వరి, మనమ్మ, రజిత పాల్గొన్నారు.

మొక్కలు పెంచడం అందరి బాధ్యత


రమణక్కపేటలో మొక్క నాటుతున్న అధికారులు

మంగపేట: మొక్కలు పెంచడం అందరి బాధ్యత అని అటవీ శాఖ రేంజ్ అధికారి షకీల్‌పాషా అన్నారు. మండలంలోని రమణక్కపేట, మంగపేటలో అటవీశాఖ రేంజ్ అధికారి షకీల్‌పాషా ఆధ్వర్యంలో వనమహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. షకీల్‌పాషాతో కలిసి ఎస్సై టీవీఆర్ సూరి మొక్కలు నాటారు. అలాగే రేంజ్ పరిధిలోని ఎఫ్ఆర్‌ఓ, బీటాఫీసర్, బేస్ క్యాంప్ సిబ్బందితో కలిసి మంగపేట ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి మాట్లాడుతూ.. మొక్కలు పెంచడం వలన మానవాలికి ప్రాణవాయువును అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి అశోక్‌కుమార్, కోటేశ్వర్‌రావు, రషీద్, ఎఫ్‌ఎస్‌ఓలు ఉన్నారు.

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం పాఠశాలలో మంగళవారం విద్యార్థులు మొక్కలను నాటారు. వన మహోత్సవంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటి నీరు పోశారు.

బొప్పారంలో వైద్యశిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యులు

కాటారం: మండలంలోని బొప్పారంలో వైద్య ఆరగ్యో శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరం, దగ్గు, జలుబు, ఇతరాత్ర వ్యాధులతో బాధపడుతున్న రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. తీవ్ర జ్వరం ఉన్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. అనంతరం గ్రామంలో డ్రై డే నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది ఇంటింటా తిరిగి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తిరుపతిరెడ్డి, ఏఎన్‌ఎం సుజాత, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు


మరమ్మతులు చేపిస్తున్న అధికారులు

టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(టీ)లో తాగునీటి సరఫరా పైపు లీకేజీ కావడంతో ఎంపీఓ గౌడ సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ పంచాయితీ సిబ్బంది మరమ్మత్తులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ వర్షాకాలంలో పైపుల లీకేజీ వల్ల నీరు కలుషితముతుందని మరమ్మతు చేసినట్లు తెలిపారు. ప్రజలకు శుభ్రమైన తాగు నీటిని అందించడమే లక్ష్యంగా అధికారులు విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందించాలని సూచించారు.

కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

మంగపేట: మంత్రి సీతక్కపై అహంకారంగా మాట్లాడిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మండల నాయకులు మాట్లాడారు. ఒక ఎమ్మెల్యే అయి ఉండి అసెంబ్లీలో ఓ మహిళా మంత్రి, ప్రజా సేవకురాలు అయిన సీతక్కపై జ్ఞానం లేకుండా మాట్లాడడం సరికాదన్నారు. దీనికి ప్రతిఫలంగా నీ నియోజకవర్గ మహిళలే బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జయారాంరెడ్డి, నాయకులు సురేందర్, యానయ్య, నర్సింహారావు, నరేష్, ఆదినారాయణ, మల్లయ్య, శ్రావణ్‌కుమార్, శ్రీధర్, శేషగిరిరావు, వెంకటేశ్వర్లతో పాటు తదితర నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ సర్పంచ్‌లు, గ్రామస్తులు

టేకుమట్ల: మండలంలోని మందలోరిపల్లి గ్రామానికి చెందిన బండి సమ్మయ్యగౌడ్ ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి చికిత్స పొందాడు. కాగా, మంగళవారం మందలోరిపల్లి, దుబ్యాల మాజీ సర్పంచ్‌లు కట్కూరి నరసింహారెడ్డి, బిల్లకంటి ఉమేందర్ రావు పరామర్శించి, ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం ప్రమాద సంఘటనను అడిగి తెలుసుకుని, వృత్తిలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వారి వెంట ఉప సర్పంచ్ రజితసంపత్, గౌడ సంఘం నాయకులు సారధి, గట్టు రవి, గుండెబోయిన తిరుపతి, మొగిళిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, స్థానికులు స్వామిరావు, రాయమల్లు, సునీల్, ఖాదర్, లక్ష్మన్, పోశయ్య, గుండెబోయిన రాయమల్లు, తదితరులు ఉన్నారు.

అటవీ గ్రామాల్లో తనిఖీ


మహాముత్తారం: గొత్తికోయలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాగార్జునరావు


మల్హర్: వాహనాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నరేష్

మహాముత్తారం: మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సింగారం, బోర్లగూడెం, పెగడపెల్లి, నిమ్మగూడెం, రెడ్డిపల్లి, కనుకునూరు గ్రామాల్లో మంగళవారం సీఐ నాగార్జునరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాటారం సీఐ నాగార్జునరావు మాట్లాడుతూ గ్రామాల్లోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వస్తే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని ఆయా గ్రామాల ప్రజలకు సూచించారు. యువకులు ఉన్నత చదువు చదివి మంచిస్థాయికి ఎదగాలే తప్ప చెడు వ్యసనాలకు అలవాటుపడవద్దని సూచించారు. సీఐ వెంట మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్, సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు ఉన్నారు.

అనుమానితులు వస్తే సమాచారం ఇవ్వాలి

భూపాలపల్లి రూరల్: అనుమానిత వ్యక్తులు గ్రామంలోకి వచ్చినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు గ్రామస్తులు సూచించారు. మావోయిస్టు వారోత్సవాలు సందర్భంగా మంగళవారం భూపాలపల్లి మండలంలోని పందిపంపుల గ్రామంలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ సంపత్‌రావు మాట్లాడుతూ.. సంఘ వ్యతిరేకంగా పని చేసే వారికి సహకరించవద్దన్నారు. తనిఖీల్లో భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్, భూపాలపల్లి ఎస్సై సుధాకర్, పోలీసులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మల్హర్: కొయ్యూరు నాగులమ్మ క్రాస్ వద్ద కొయ్యూరు ఎస్సై నరేష్ విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మంథని–కాటారం వైపు వెళ్తున్న వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహన ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. అనుమానితులను విచారించి వదిలేశారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

795 మంది రైతులకు రుణమాఫీ

కాటారం: ప్రభుత్వం విడతల వారిగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీ రెండో వి డతలో భాగంగా లక్షన్నర లోపు రుణం కల్గిన మండలంలోని 795 మంది రైతులకు రుణమాఫీ అయింది. ఎస్‌బీఐ పరిధిలో 447 మంది రైతులు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలోని 279 మంది, యూనియన్ బ్యాంక్ పరిధిలోని 69 మంది రైతులకు రుణమాఫీ అమలైనట్లు అధికారులు తెలిపారు. 795 మంది రైతులకు సంబంధించి రూ.8,40,15,879 వారి ఖాతాల్లో జమైనట్లు పేర్కొన్నారు. రెండో విడత రుణమాఫీ జాబితాలో తమ పేరు ఉందని తెలుసుకున్న లబ్ధిదారులు రుణం పొందిన బ్యాంకుల వద్దకు పరుగులు తీశారు. తిరిగి రుణం పొందడానికి అవసరమైన ధృవీకరణపత్రాలను తీసుకొని బ్యాంక్‌ల వద్ద పడిగాపులు కాశారు. మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు. రెండో విడత రుణమాఫీ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించి రుణమాఫీపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, ఆర్ఐ వెంకన్న, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.